



రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరి, కావ్య



రైతు ధన్‌సింగ్‌తో మాట్లాడుతున్న కేసీఆర్



ఎర్రబెల్లితో మాట్లాడుతున్న కేసీఆర్

- జనగామ జిల్లాలో సాగిన కేసీఆర్ పర్యటన
- ధరావత్‌తండా రైతులతో మాజీ సీఎం మాటాముచ్చట
- ఎండిన పంటలను చూపించిన బాధితులు
- అధైర్యపడొద్దు.. అండగా ఉంటాని హామీ
- 26 నిమిషాల పాటు సాగిన పర్యటన

బాధలు వింటూ.. భరోసానిస్తూ..

జనగామ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా దేవరుప్పుల మండలం ధరావత్‌తండాలో మాజీ సీఎం కేసీ ఆర్ పర్యటన రైతులకు భరోసానిచ్చేలా సాగింది. బాధిత రైతులతో ఆయన మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏ రైతు ఎంత సాగు చేసింది.. ఎంత ఎండిపోయింది.. ఎంత నష్ట వచ్చింది.. ఎన్ని బోర్లు వేశారు.. అంటూ రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతుల సమస్యలు తెలుసుకుంటూ వారి గోడును సావధానంగా విన్నారు. రైతుల బాధలు విన్న ఆయన.. ఎవరూ ధైర్యం చెడవద్దని, తానున్నానని భరోసానిచ్చారు.

కాగా, షెడ్యూల్ ప్రకారం ఉదయం 10.30గంటలకు ధరావత్‌తండాకు కేసీఆర్ చేరుకోవాల్సి ఉండగా, గంటన్నరకు పైగా ఆలస్యంగా వచ్చారు. ఉదయం 11.27కు జనగామ జిల్లా సరిహద్దు అయిన పెంబర్తి కళాతోరణం వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి నెల్లుట్ల క్రాస్‌రోడ్ మీదుగా ధరావత్ తండాకు 12.06కు ప్రత్యేక బస్సులో వచ్చారు. పెద్దఎత్తున జనం తోసుకురావడంతో 4నిమిషాల పాటు బస్సులో ఉన్నారు. 12.10 గంటలకు బస్సు దిగి రోడ్డు పక్కనే ఉన్న పంట పొలాల వద్దకు వచ్చారు. అక్కడే ఆయన రైతులతో ముచ్చటించారు. 15 నిమిషాల పాటు రైతులతో మాట్లాడారు. అనంతరం 12.32 గంటటకు బస్సు ఎక్కి సూర్యాపేట జిల్లాకు పయనమయ్యారు.

పంట ఎండిపోయింది..

తాను 6 ఎకరాల్లో వరి నాటు వేశానని, ఉన్న ఒక్క బోరూ ఎండిపోవడం వల్ల పంటంతా ఎండిపోయిందని తండాకు చెందిన మహిళా రైతు సత్తెమ్మ కేసీఆర్ వద్ద గోడు వెళ్లబోసుకుంది. పంటను కాపాడుకునేందుకు నెల కిందట రూ.2లక్షలు వెచ్చించి నాలుగు బోర్లు వేసినా చుక్క నీరు పడలేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఏప్రిల్ 4న తన కొడుకు రాజేందర్ పెళ్లి ఉందని, ఇదే సమయంలో పంట నష్టపోయాయని, బోర్లు వేసినందుకు రూ.2 లక్షలు అప్పులు అయ్యాయని కేసీఆర్‌కు తెలిపింది. దీనికి స్పందించి కేసీఆర్ సత్తెమ్మ కొడుకు పెళ్లి ఖర్చుల నిమిత్తం రూ.5 లక్షల చెక్కు ఇస్తానని ఆమెకు హామీ ఇచ్చారు. మహిళా రైతు ఖాతా వివరాలు పంపించాలని మాజీ మంత్రి దయాకర్‌రావుకు సూచించారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 4న జరిగే తన కుమారుడి పెళ్లికి రావాల్సిందిగా కోరుతూ మహిళా రైతు సత్తెమ్మ కేసీఆర్‌కు పెళ్లి పత్రికను అందజేశారు.





రైతులతో మాట్లాడుతున్న కేసీఆర్

సీఎం.. సీఎం అంటూ నినాదాలు

కేసీఆర్ పర్యటన సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కేసీఆర్ బస్సులోనుంచి దిగి కార్యకర్తలకు అభివాదం చేశారు. కేసీఆర్‌ను చూసి కార్యకర్తలు, నాయకులంతా సీఎం.. సీఎం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆయనకు స్వాగతం పలికారు. కేసీఆర్ పర్యటనలో బీఆర్ఎస్ శ్రేణులు ప్లకార్డులు ప్రదర్శించారు. ఎండి న పంటలకు రూ.25వేల పరిహారం ఇవ్వాలని, రూ.2 లక్ష ల రుణమాఫీ చేయాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు.



కేసీఆర్‌ను చూసేందుకు తరలివచ్చిన కార్యకర్తలు

చేతి కర్ర సాయంతో..

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేతి కర్ర సాయంతోనే పర్యటనకు వచ్చారు. బస్సు దిగే క్రమంలో, ఎక్కే క్రమంలో వ్యక్తిగత సహాయకుల సహకారం తీసుకున్నారు. కర్ర సాయంతోనే అడుగులు వేసుకుంటూ పంటలను పరిశీలించారు.

పోలీసుల వైఫల్యం

మాజీ సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో పోలీసుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. ప్రతిపక్షనేత స్థాయిలో జిల్లాకు వచ్చిన ఆయనకు బందోబస్తు కల్పించడంలో పోలీసులు అలసత్వం వహించారు. కేసీఆర్ రాక సందర్భంగా పాలకుర్తి, జనగామ,

మిగతా 6వ పేజీలో..

కేసీఆర్ వాహనం తనిఖీ

6లో..

- లోకసభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో..



ప్రభుత్వం పంట నష్ట పరిహారం అందించాలి..

- మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

6లో..

కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరి, కావ్య

- కండువా కప్పి ఆహ్వానించిన సీఎం రేవంత్, మున్షీ
- హనుమకొండలో కడియం ఇంటి వద్ద బందోబస్తు

రాంనగర్, మార్చి 31: స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కూతురు కడియం కావ్య కాంగ్రెస్‌లో చేరారు. ఆదివారం ఉదయం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసానికి కడియం శ్రీహరి, కావ్యలు వెళ్లారు. వీరికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాగా, కావ్యను బీఆర్ఎస్ నుంచి వరంగల్ ఎంపీగా ప్రకటించిన విషయం తెలిసిందే. మూడు రోజుల కిందట బీఆర్ఎస్ నుంచి పోటీ చేసేందుకు విముఖత వ్యక్తం చేస్తూ కడియం కావ్య ఆ పార్టీ అధినేత కేసీఆర్‌కు లేఖ రాశారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నేతలు హైదరాబాద్‌లో కడియం నివాసానికి వెళ్లి తమ పార్టీలోకి రావాల్సిందిగా ఆహ్వానించారు. ఆదివారం కడియం శ్రీహరి, ఆయన కూతురు కావ్య హస్తం పార్టీలో చేరారు. కడియం కావ్యను కాంగ్రెస్ పార్టీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా ఒకటి రెండురోజుల్లో ప్రకటించే అవకాశం ఉంది.

కడియం ఇంటిముందు పోలీసుల పహారా



హనుమకొండలోని కడియం శ్రీహరి ఇంటి ముట్టడి చేస్తారని ప్రచారం జరగడంతో ముందస్తుగా బందోబస్తు ఏర్పాటు చేశారు. కడియం శ్రీహరి మాదిగ సామాజిక వర్గాన్ని అణచివేశా డని, అతడి కూతురికి కాంగ్రెస్ టికెట్ ఇవ్వకూడదని డిమాండ్ చేస్తూ మాదిగ సామాజిక వర్గం ఆధ్వర్యంలో హనుమకొండ అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అక్కడి నుంచి ఎక్సైజ్‌కాలనీలోని కడియం శ్రీహరి నివాసానికి వెళ్లి నిరసన తెలుపుతారనే ప్రచారం జరిగింది. దీంతో పోలీసులు అప్రమత్తమై కడియం నివాసం ముందు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అనుమతి లేకుండా నిరసన కార్యక్రమం చేపట్టడం సరికాదని అంబేద్కర్ విగ్రహం నుంచి మాదిగ సామాజిక వర్గం నేతలను పోలీసులు పంపించారు. దీంతో వారు అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన నిరసనకు పరిమితమయ్యారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



అర్జున్ (ఫైల్)

కురవి, మార్చి 31 : రాజోలు శివారు బాలుతండాకు చెందిన బానోత్ అర్జున్ (45) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు, ఎస్సై గోపి తెలిపిన వివరాల ప్రకారం. అర్జున్ తన కూతురు గంగోత్రి వివాహానికి గత సంవత్సరం రూ.5 లక్షల అప్పు తీసుకువచ్చాడు. ఆ తర్వాత వ్యవసాయం కోసం మరో రూ.4 లక్షలను అప్పు చేసి పంట సాగు చేశాడు. వ్యవసాయంలో దిగుబడి రాకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలన్న మనస్తాపానికి గురైన అర్జున్ శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ అర్జున్ మృతి చెందాడు. మృతుడు అర్జున్‌కు భార్య లక్ష్మి, కుమారులు అశోక్, కుమార్తె గంగోత్రి ఉన్నారు.

ఆదివారం ఉష్ణోగ్రతలు	గరిష్ఠం : 38.0°C	కనిష్ఠం : 22.5°C



రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సోమవారం	సా : 6.35 గం..
సహర్ :	మంగళవారం	ఉ : 4.48 గం..



మాధవాపురంలో మాట్లాడుతున్న భూక్య మురళీనాయక్

ఇందిరమ్మ కమిటీలతోనే సమస్యల పరిష్కారం

- మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్, మార్చి31 : గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మాధవాపురంలో ఆదివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలానికి 500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని చెప్పారు. ఇందిరమ్మ కమిటీలో 5 నుంచి 10 సభ్యులను ఎన్నుకుని, గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ఇండ్లు లేనివారికి మొదట ప్రాధాన్యత ఉంటుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందలేదని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీపై నుంచి కింద వరకు ఖాళీ అవుతోందని, త్వరలోనే అది కనుమరుగయ్యే అవకాశం ఉందని జోస్యం చెప్పారు. సమావేశంలో మద్ది వెంకట్‌రెడ్డి, బొమ్మకంటి వీరన్న, నూకల రవి, రాజేందర్, బంటు అంజయ్య, నక్క తిరుపతయ్య, నూకల లింగన్న, వీరన్న, ఇస్లావత్ వెంకన్న, రవి, బోడ కృష్ణ పాల్గొన్నారు.

లక్ష్యం 1.70 లక్షల మెట్రిక్ టన్నులు

- నేటి నుంచి వడ్ల కొనుగోళ్లు ప్రారంభం
- జిల్లాలో మొదటి విడుతగా 24 కేంద్రాల షురూ
- కనుపాపలతోనే ధాన్యం సేకరణ
- మారిన నిబంధనలు.. దళారులకు చెక్
- కాంగ్రెస్ ప్రకటించిన వరి బోనస్ అందేనా?!



మానుకోట కొనుగోలు కేంద్రంలో లారీలోకి ధాన్యం బస్తాలను ఎక్కిస్తున్న దృశ్యం (ఫైల్)



వడ్లను ఆరపెడుతున్న మహిళ రైతు (ఫైల్)

మండలం	కొనుగోలు కేంద్రం
బయ్యారం	బయ్యారం -1
చిన్నగూడూరు	చిన్నగూడూరు-1
దంతాలపల్లి	గున్నెపల్లి
డోర్నకల్	గొల్లచర్ల
గార్ల	గార్ల-1
గూడూరు	గూడూరు
ఇనుగుర్తి	ఇనుగుర్తి
కేసముద్రం	ధన్నసరి
కొత్తగూడ	కోనపురం, పొగుళ్లపల్లి
కురవి	నేరడ, కురవి
మహ-బాద్	శనిగపురం
మరిపెడ	ఎడ్జెర్ల, తండధర్మారం, తానంచెర్ల
నర్సింహులపేట	నర్సింహులపేట
నెల్లికుదురు	రామన్నగూడెం
పెద్దవంగర	పెద్దవంగర(1,2)
సీరోలు	కాంపెల్లి, మన్నెగూడెం
తొర్రూరు	కొమ్మనపల్లి, నాంచారిమడూర్

మహబూబాబాద్ అగ్రికల్చర్, మార్చి 31 : జిల్లాలో ధాన్యం సేకరణ సోమవారం (నేటి) నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఇప్పటికే ప్రభుత్వం పూర్తి చేసింది. మహబూబాబాద్ జిల్లాలో మొత్తం 185 వడ్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర సర్కారు భావించినప్పటికీ, తొలి విడుతగా 24 కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకు గాను సర్వం సిద్ధం చేసింది. మద్దతు ధరతో ధాన్యం ఖరీదు చేయడానికి విధి విధానాలు ఈ సీజన్ నుంచి మార్చారు. రైతులు స్వయంగా కొనుగోలు కేంద్రాలకు వచ్చి అక్కడున్న యంత్రాల ద్వారా కనుపాపలు (ఐరీస్) ఫొటో తీసుకుంటేనే ధాన్యం కొనుగోళ్లు జరుగుతాయి.

జిల్లాలో 185 కొనుగోలు కేంద్రాలు..

జిల్లాలో 185 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడానికి సివిల్ సప్లయీస్ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో 125, ఐకేపీ 49, జీసీసీ 7, ఇతరులు 4 కేంద్రాల ద్వారా వడ్ల కొనుగోళ్లను చేపట్టనున్నారు. అయితే ఏటా ఏప్రిల్ చివరి వారంలో వడ్ల కొనుగోళ్లను ప్రారంభిస్తారు. అయితే ఈ సారి ముందుగానే ధాన్యం సేకరణను ప్రారంభించనున్నారు. మహబూబాబాద్ జిల్లాలో గతేడాది 1.48 లక్షల ఎకరాల్లో వరిసాగు చేయగా, ఈ సారి 1.28 లక్షల ఎకరాల్లో మాత్రమే పంట వేశారు. అయితే 1.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. దానికనుగుణంగానే సివిల్‌సప్లయీస్ అధికారులు కూడా కొనుగోళ్లు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. సరిపడ గోనె సంచులను తయారుగా ఉంచారు. ఖరీదైన ధాన్యాన్ని వెంటనే తరలించేందుకు కాంట్రాక్టర్లను ఏర్పాటు చేశారు. అలాగే ధాన్యం సేకరణ నిర్వాహకులతో శనివారం కలెక్టరేట్‌లో శిక్షణ నిర్వహించారు. ఏ-గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ.2203, కామన్ రకం క్వింటాకు రూ.2183 చొప్పున ఖరీదులు చేపట్టనున్నారు.

ఐరీస్ ఫొటోతోనే సేకరణ..

ధాన్యం కొనుగోలు కేంద్రాలలో జరిగే అవకతవకలకు చెక్‌పెట్టేందుకు సివిల్ సప్లయీస్ కమిషనర్ కొత్త నిబంధనలు విధించారు. కొనుగోలు కేంద్రాలలో రైస్‌మిల్లర్లు గానీ, ప్రైవేట్ వ్యక్తులు గానీ ఎవరైనా కన్పించకూడదని, అలా కన్పించినట్లయితే చర్యలు తీసుకుంటామని ఆదేశాలు జారీ చేశారు. కొత్తగా రైతే స్వయంగా కొనుగోలు కేంద్రానికి వచ్చి, యంత్రాల ద్వారా కంటిపాపలను (ఐరీస్) ఫొటో తీస్తేనే రైతు వివరాలు, సాగుచేసిన పంట వివరాలు, ప్రక్రియ

మిగతా 6వ పేజీలో..

నేటి నుంచే కొనుగోళ్లు ప్రారంభం

- కృష్ణవేణి, సివిల్ సప్లయీస్ మేనేజర్, మహబూబాబాద్ జిల్లా



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో ఈనెల 1వ తేదీ నుంచి వడ్ల కొనుగోళ్లను ప్రారంభిస్తున్నాం.మొదటి విడతలో జిల్లాలో 24 కేంద్రాలను పీఏసీఎస్, ఐకేపీ, డీహెచ్ఎస్ సీవో కేంద్రాలను ద్వారా వడ్ల కొనుగోళ్లు చేపడుతాం. ప్రభుత్వ లక్ష్యం 1.70 మెట్రిక్ టన్నుల సేకరణే లక్ష్యం విధించినప్పటికి ధాన్యం ఎంతవచ్చినా ఖరీదు చేస్తాం. నీటి వసతి లేని కారణంగా 1.20 లక్షల మెట్రిక్ టన్నుల వరకే వస్తుందని భావిస్తున్నాం. అన్ని సౌకర్యాలు కేంద్రాల వద్ద కల్పించాం. రైతులు కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుని ప్రభుత్వ మద్దతు ధర పొందాలి.

ఐదుగురు ఉపాధ్యాయుల సస్పెన్షన్

గూడూరు, మార్చి 31 : పదో తరగతి పరీక్ష కేంద్రానికి సెల్‌ఫోన్ తీసుకువచ్చారన్న కారణంతో మహబూబాబాద్ జిల్లా గూడూరు బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో విధులు నిర్వర్తించిన డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాస్, చీఫ్ సూపరిండెంట్ విష్ణువర్దన్, ఇన్విజిలేటర్లు కోటేశ్వర్‌రావు, సులోచన, సంధ్యారాణిపై డీఈవో రామారావు సస్పెన్షన్ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సదరు పరీక్ష కేంద్రాన్ని శనివారం డీఈవో రామారావు అకస్మీకంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో సెల్‌ఫోన్‌లు పరీక్ష ఆవరణలో ఉన్నాయని, ఈ విషయాన్ని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు తెలిపినట్లు సమాచారం. ఈ విషయంపై ఏఎంవో అజాద్ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా, కలెక్టర్ ఆదేశాల మేరకు పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్ తీసుకువచ్చిన ఐదుగురిపై డీఈవో సస్పెన్షన్ విధించినట్లు తెలిపారు. చిన్నచిన్న విషయాలకు ఐదుగురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం తగదని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్‌నాయక్, ఎమ్మార్పీఎస్-టీఎస్ మండల అధ్యక్షుడు బాషిపాక నవీన్ కుమార్ ఖండించారు. వెంటనే వారిపై సస్పెన్షన్ వేటు ఎత్తివేసి, విధుల్లోకి తీసుకోవాలని కోరారు.



రాస్తారోకో చేస్తున్న గిరిజన యువకులు

గుడుంబాను అరికట్టాలని యువకుల రాస్తారోకో

దంతాలపల్లి, మార్చి 31 : గుడుంబా మహమ్మారి నుంచి తమ తండాను కాపాడాలంటూ ఆదివారం వాల్యతండా శివారు సింగితండా వాసులు నాటుసారా బాటిల్స్‌ను రోడ్డుపై పెట్టి వినూత్న నిరసన తెలిపి రాస్తారోకో చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామపరిధిలోని కొత్తతండా నుంచి నిత్యం వందల లీటర్ల నాటు సారాను సింగితండాకు తీసుకువచ్చి విక్రయిస్తున్నారన్నారు. యువతతో పాటు మహిళలు, వృద్ధులు గుడుంబాకు బానిసై మధ్య వయసులోనే మృతి చెందుతున్నారని ఆరోపించారు.సింగితండా యువకుల ఆధ్వర్యంలో 600 లీటర్ల మద్యం పానకం, 20 లీటర్ల నాటు సారాను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో యువకులు పలువురి పేర్లతో ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు తండాకు చెందిన బానోతు వీరన్నపై కేసు నమోదు చేశారు. గడుంబా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

పోలీసుల దాడులు..

కురవి : మండలంలోని నేరడ శివారు కాకులబోడు తండాలో ఎస్సై గోపి ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో భారీగా బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. గుడుంబా, నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై గోపి మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఊపేక్షించేదిలేదని హెచ్చరించారు. గ్రామాల్లో నూతన వ్యక్తులు తారసపడితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.


మార్కెట్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొర్రూరు, మార్చి 31 : ఇంటిగ్రేడెడ్ మార్కెట్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడతామని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. ఆదివారం తొర్రూరులోని ఇంటిగ్రేడెడ్ మోడల్ మార్కెట్‌ను ఆమె సందర్శించి, కూరగాయల వ్యాపారులతో మాట్లాడి, సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెద్ద మార్కెట్ ఉన్నప్పటికీ అనుకున్న రీతిలో వ్యాపారం కొనసాగడం లేదని ఎమ్మెల్యేతో వాపోయారు. మార్కెట్ ఎదుట గంపలు పెట్టుకుని కూరగాయలు విక్రయిస్తుండటంతో మార్కెట్ లోపలికి కొనుగోలుదారులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూరగాయల వ్యాపారం చేస్తున్న వారికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి సాయం చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. మొదటి ఫ్లోర్‌లో నాన్‌వెజ్ మార్కెట్‌ను ప్రారంభిస్తామన్నారు. మార్కెట్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. సమస్యలపై దృష్టి సారించి పరిష్కారం అయ్యేందుకు అన్ని చర్యలు చేపడతామని తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ పార్టీ అధ్యక్షుడు సోమరాజశేఖర్, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, కౌన్సిలర్‌లు తూనం రోజా, రాము, శంకర్, అనిల్, శ్రావణ్, సురేష్, మల్లేషం, రాజు, తదితరులు ఉన్నారు.

రైతులను కాదు.. కూతుర్ని ఓదార్చండి

- పాలకుర్తి : రైతులకు బదులు లిక్కర్ దందాలో చిక్కుకొని తీహార్ జైల్లో ఉన్న మీ కూతురు కవితను ఓదారిస్తే బాగుంటుందని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఉద్దేశించి జనగామ జిల్లా పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి హితవు పలికారు. పాలకుర్తిలో ఏర్పాటు మీడియా సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి ఆమె మాట్లాడారు. పాలకుర్తి నియోజకవర్గంలో సాగునీరు అందక ఎక్కడా పంటలు ఎండిపోలేదని, ఇటీవల రూ.20 లక్షలు వెచ్చించి కాల్వల్లో పేరుకపోయిన మట్టితో పాటు ఏపుగా పెరిగిన చెట్లను తొలగించామని అన్నారు. పేక మేడలా కూలిపోతున్న గులాబీ పార్టీని కాపాడుకోవాడానికి నాయకులు కొత్త నాటకానికి తెరతీస్తున్నారని విమర్శించారు. స్త్రీ నిధి, ఫోన్ ట్యాపింగ్ ఇతర కేసుల్లో ఉన్న గులాబీ నాయకులను కేసీఆర్ కాపాడుకోవడంపై కేసీఆర్ దృష్టి సారించాలని, పంటలను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో లాగే వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు రాపాక సత్యనారాయణ, అమ్యానాయక్, సురేష్, రవీందర్‌రెడ్డి, సురేష్, నల్ల శ్రీరాం, నిరంజన్ రెడ్డి, తిరుపతిరెడ్డి, సోమరాజశేఖర్, పెనుగొండ రమేష్, కమ్మగాని నాగయ్య, పన్నీరు వెంకన్న పాల్గొన్నారు.



మార్కెట్‌లో వ్యాపారులతో మాట్లాడుతున్న యశస్వినిరెడ్డి

మళ్లీ క్రూ లింకుల రగడ

ఆరు లింకులు సికింద్రాబాద్‌కు తరలింపు ▸ నేటి నుంచి నిర్వహణ ▸ కాజీపేటను నిర్వీర్యం చేసే కుట్ర : మజ్దూర్ యూనియన్



కాజీపేటలోని క్రూ డిపో

కాజీపేట, మార్చి 31 : ఎనిమిదేళ్ల క్రితం తలెత్తిన క్రూలింకుల తరలింపు రగడ మళ్లీ తెరపైకి వచ్చింది. కాజీపేట నుంచి నిర్వ హించే కొన్ని రైళ్ల లింకులను విజయవాడకు తరలించారు. లింకుల తరలింపుతో కాజీపేట డిపో నిర్వీర్యం అవుతుందని రైల్వే ఉద్యోగ సంఘాలు, రాజకీయ పార్టీలు ఎన్ని ఉద్యమాలు చేసినా ఫలితం లేకుండా పోయింది. రైల్వే ఉన్నతాధికారులు కొన్ని లింకులను విజయవాడకు తరలించి అన్నంత పనిచేశారు. మళ్లీ సోమవారం కాజీపేట నుంచి నిర్వహణ చేపట్టే ఆరు లింకులు కాజీపేట-మణుగూర్‌కు ఎక్స్‌ప్రెస్ అప్ అండ్ డౌన్, కాజీ పేట-సిర్పూర్ కాగజ్‌నగర్ అప్ అండ్ డౌన్, కాజీపేట-బల్లార్ష అప్ అండ్ డౌన్ లింకులను సికింద్రాబాద్‌కు తరలించాలని, ఇక మీదట కాజీపేట మీదుగా కాకుండా సికింద్రాబాద్ నుంచే ఈ లింకుల నిర్వహణ చేపట్టాలని రైల్వే ఉన్నతాధికారులు ఆదేశాలతో కూడిన నోటీసు జారీ చేశారు. దీంతో మళ్లీ లోకోపైలెట్‌లలో ఆందోళన మెదలైంది. రైల్వే అధికారులు ఈ నిర్ణయంతో లోకో పైలెట్‌లు, అసిస్టెంట్ లోకోపైలెట్‌లు, ట్రెయిన్ మేనేజర్లు సుమారు 18 మందికి విధులకు ఆటంకం కలుగుతుందని, ఇక్కడ స్థిరపడిన వారికి తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. కాజీపేట రైల్వే డ్రైవర్‌లు డిపో కార్యాలయానికి ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని లోకోపైలెట్‌లు వాపోతున్నారు. ఓ వైపు కాజీపేటను డివిజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ ఉండగా డిపోను నిర్వీర్యం చేసే కుట్రలు జరుగున్నాయంటున్నారు.

కాజీపేటను నిర్వీర్యం చేసే కుట్ర

పి.రవీందర్, డివిజనల్ సెక్రటరీ - మజ్దూర్ యూనియన్



కాజీపేట నుంచి కొన్ని ట్రెయిన్ లింకులను సికింద్రాబాద్ తరలించే నిర్ణయాన్ని రైల్వే అధికారులు వెనక్కి తీసుకోవాలని, లేకుంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని మజ్దూర్ యూనియన్ డివిజనల్ సెక్రటరీ పి.రవీందర్ డిమాండ్ చేశారు. ఎకనామి సేవ్ పేరుతో రైల్వే అధికారులు లోకోపైలెట్‌లపై పనిభారాన్ని పెంచుతున్నారని అన్నారు. కాజీపేట డిపోను తరలించేందుకు అధికారులు కుట్రలు చేస్తున్నారన్నారు. లోకోపైలెట్‌లకు 20 గంటలకు పైగా పని చేయించకుండా 11 గంటలు పని చేయించాలని, రన్నింగ్ స్టాఫ్‌లో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

నేడు నీటి సరఫరా బంద్

వరంగల్ కార్పొరేషన్, మార్చి 31 : హనుమకొండ నయీంనగర్ వద్ద పైప్‌లైన్ ఇంటర్ కనెక్షన్ పనులు జరుగుతున్నందున సోమవారం కేయూసీ ఫిల్టర్‌బెడ్ నుంచి వచ్చే నీటి సరఫరాను బంద్ చేసినట్లు బల్దియా ఈఈ బి.శ్రీనివాసరావు ఒకప్రకటనలో తెలిపారు. నయీంనగర్ నాలా వద్ద రోడ్డు విస్తరణ పనులు జరు గుతున్నాయని, పబ్లిక్‌గార్డెన్, గుడిబండల్, గోపాలపురం, కేయూ జంక్షన్ ప్రాం తం, లోటస్‌కాలనీ, టీబీ ఆస్పత్రి ప్రాంతం, దుర్గానగర్, భీమారం, సుధానగర్, రాయపుర, గణేశ్‌నగర్, యాదవనగర్, కిషన్‌పుర, గౌతంనగర్, కృష్ణకాలనీలో ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదని వెల్లడించారు.

ఎన్టీపీసీ 'రెండో దశ'తో ఒప్పందానికి నో!

2400 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణం.. కరెంటు కొనుగోలుకు సర్కారు విముఖత

- విద్యుత్తు వచ్చేది 5-8 ఏళ్ల తర్వాతే!
- అప్పటికి రూ.8-9 మధ్య యూనిట్ ధర
- ఒప్పందం చేసుకుంటే రాష్ట్రానికి గుదిబండే!



హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో ఎన్టీపీసీ ఆధ్వర్యంలో నిర్మించతలపెట్టిన రెండో విడత తెలంగాణ సూపర్ థర్మల్ విద్యుత్తు కేంద్రం నుంచి కరెంటు కొనుగోలు చేస్తే రాష్ట్రానికి పెనుభారంగా మారే ప్రమాదం ఉందని ప్రభుత్వం అంచనా వేసింది. 2400 మెగావాట్ల సామర్థ్యంతో తలపెట్టిన ఈ విద్యుత్కేంద్రం నిర్మాణానికి ఐదు నుంచి ఎనిమిదేళ్ల పడుతుందని.. అప్పటికి ఇక్కడి నుంచి ఉత్పత్తయ్యే విద్యుత్తు ధర యూనిట్‌కు రూ.8-9కి ఎగబాకుతుందని రాష్ట్ర ఇంధన శాఖ అంచనాకు వచ్చింది. బహిరంగ మార్కెట్లో ఇంతకంటే తక్కువ ధరకే విద్యుత్తు లభిస్తుండగా, భారీ ధరతో 25 ఏళ్ల పాటు కరెంటు కొనుగోలుకు దీర్ఘకాలిక ఒప్పందం చేసుకుంటే రాష్ట్ర ప్రజలపై రూ.వేల కోట్ల అనవసర భారం పడుతుందని తేల్చింది. ఈ నేపథ్యంలో ఎన్టీపీసీతో ఎలాంటి విద్యుత్తు కొనుగోలు ఒప్పందం చేసుకోరాదని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. త్వరగా ఒప్పందం చేసుకోకపోతే ఇతర రాష్ట్రాలతో అగ్రిమెంట్ చేసుకుని విద్యుత్కేంద్రం నిర్మిస్తామని ఎన్టీపీసీ ఇటీవల అల్టిమేటం జారీ చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యవహారంపై సమీక్షించి, కొనుగోలు ఒప్పందం చేసుకోరాదని నిర్ణయించింది. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో విద్యుత్తు కొరతను తీర్చడానికి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 4000 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని పునర్విభజన చట్టం-2014లో కేంద్రం హామీ ఇవ్వగా, తొలి విడత కింద 1600 మెగావాట్ల విద్యుత్కేంద్రం నిర్మాణాన్ని ఇటీవల ఎన్టీపీసీ పూర్తి చేసింది. రెండో విడత కింద 2400 మెగావాట్ల ప్లాంట్లను నిర్మించాల్సి ఉంది. తొలి విడత విద్యుత్తు ధర యూనిట్‌కు రూ.5.90 ఉండగా, ఒప్పందం కారణంగా కొనుగోలు చేయక తప్పని పరిస్థితి ఉంది.

గత సర్కారు తప్పిదమే..!

పదేళ్లలో గత ప్రభుత్వం చేసిన పాపాలు రాష్ట్రంలో విద్యుత్తు సంస్థలకు గుదిబండగా మారాయని కాంగ్రెస్ సర్కారు ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. రెండో విడతలో 2400 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణానికి ఎన్టీపీసీతో ఒప్పందం చేసుకోకుండా 10 ఏళ్లపాటు జాప్యం చేయడమే దీనికి కారణమని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అప్పట్లో ఒప్పందం చేసుకొని ఉంటే ఇప్పటికే నిర్మాణం పూర్తయి, తక్కువ ధరకు రాష్ట్రానికి కరెంటు వచ్చేదని చెబుతున్నాయి. ఇప్పుడు ఒప్పందం చేసుకుంటే భవిష్యత్తులో రాష్ట్రానికి గుదిబండగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

కొత్త థర్మల్ ప్లాంట్లకు స్వస్తి..

దామరచర్లలో తెలంగాణ జెన్‌కో నిర్మిస్తున్న 4000 మెగావాట్ల యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం నాలుగేళ్ల కిందే పూర్తి కావాల్సి ఉండగా, ఇంకా పనులు సాగుతున్నాయి. జాప్యంతో ప్రాజెక్టు నిర్మాణ వ్యయం పెరిగింది. కాలం చెల్లిన సబ్‌క్రిటికల్ టెక్నాలజీతో నిర్మించిన భద్రాద్రి విద్యుత్తు కేంద్రం వ్యయం సైతం భారీగా పెరగడంతో దాని విద్యుత్తు ధరలూ పెరిగిపోయాయి. యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్ల నిర్మాణంలో తీవ్ర అవినీతి ఆరోపణలు రావడంతో కాంగ్రెస్ సర్కారు న్యాయ విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో మళ్లీ కొత్త థర్మల్ విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణం జోలికి వెళ్లవద్దని ప్రభుత్వం ఓ అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. ప్రత్యామ్నాయంగా మార్కెట్లో రూ.2-4కు యూనిట్ చొప్పున లభిస్తున్న పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని పెంచుకోవాలని నిర్ణయించింది. సౌర, జల, పవన, పంప్డ్ స్టోరేజీ, బ్యాటరీ స్టోరేజ్ విద్యుత్తుపై దృష్టిపెట్టాలని నిర్ణయించింది.

బాసర ఆలయంలో విజిలెన్స్ తనిఖీలు

(మొదటిపేజీ తరువాయి)

సెంట్రల్ స్టోర్‌లో ఉన్న సరుకులను పరిశీలించారు. సరుకుల నాణ్యత, బ్రాండ్‌లు రికార్డుల్లో పేర్కొన్న ప్రకారం ఉన్నాయో లేదో సరి చూశారు. టెండరులో ఉన్న బ్రాండ్‌లు, క్వాలిటీ కాకుండా ఇతర సరుకులు ఉన్నట్లు, రికార్డుల్లో ఉన్న సరుకులకు, స్టోర్ రూమ్‌లో ఉన్న సరుకుల లెక్కలకు తేడాలు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ఆలయ కార్యాలయంలో దాదాపు 5 గంటల పాటు రికార్డులను పరిశీలించారు. సరుకుల కొనుగోళ్లకు సంబంధించిన ప్రతీ బిల్లును తనిఖీ చేశారు. జాబితాలో దాదాపు 70 శాతానికి పైగా సరుకుల ధరలు మార్కెట్ రేటు కంటే ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. ఈ విషయంలో ఆలయ అధికారులపై విజిలెన్స్ అధికారి అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఎంత రేటు కూడా చూడకుండా టెండరును ఎలా నిర్ధారణ చేస్తారని అధికారులను ప్రశ్నించారు. విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా రావడంతో ఆలయ ఈవో హైదరాబాద్ నుంచి హుటాహుటిన బాసర వచ్చారు. కాగా, విజిలెన్స్ అధికారుల ఇచ్చే నివేదిక ఆధారంగా దేవాదాయ శాఖ చర్యలు తీసుకుంటుంది.

పంట నష్టం పరిహారమేదీ?

ఏడాదిగా ఎదురుచూస్తున్న రైతన్నలు.. గతేడాది మార్చి, ఏప్రిల్‌లో 1,51,545 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

- ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇస్తామన్న గత ప్రభుత్వం
- నేటికీ అందని రెండో విడత పంట నష్టపరిహారం
- కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఇవ్వాలని రైతుల వేడుకోలు



జగిత్యాల జిల్లా మోరపల్లిలో నేలవాలిన మొక్కజొన్న (ఫైల్)

జనగామ/జగిత్యాల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలు ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలు అకాలవర్షానికి నేలపాలయ్యాయి. వడగళ్ల వానలు, ఈదురుగాలులు పంటలను అతలాకుతలం చేశాయి. రైతన్న వేదనను చూసిన ప్రభుత్వం.. వారికి పంట నష్టపరిహారం ఇచ్చి ఆదుకుంటామని హామీ ఇచ్చింది. నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10 వేల చొప్పున ఇస్తామని చెప్పింది. కానీ, ఏడాది కాలం గడిచిపోతున్నా.. ఇప్పటికీ రైతులకు పరిహారం అందలేదు. ఇంకా వారికి ఎదురుచూపు తప్పలేదు. గతేడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో కురిసిన అకాల వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా అధిక విస్తీర్ణంలో వరి, మామిడి, మొక్కజొన్న తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కోత దశకు వచ్చిన పంట కావడంతో వడగళ్ల దెబ్బకు గింజలన్నీ నేలరాలి రైతులకు కడగళ్లను మిగిల్చాయి. అధికారుల ద్వారా పంట నష్టం వివరాలను తెప్పించుకున్న నాటి ప్రభుత్వం.. నష్టపోయిన రైతులందరికీ పరిహారం చెల్లిస్తామని చెప్పినా.. కేవలం మార్చి నెలకు సంబంధించిన పరిహారాన్ని మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేసింది. అయితే మార్చి నెలలో జరిగిన నష్టం కన్నా ఏప్రిల్‌లో రెట్టింపు నష్టం సంభవించింది. కానీ, ఏప్రిల్‌లో జరిగిన నష్టానికి సంబంధించిన పరిహారాన్ని మాత్రం రైతులకు నేటికీ ఇవ్వలేదు. ఇందుకోసం రూ.151.54 కోట్లు విడుదల చేస్తున్నట్లు ఆనాడు ప్రకటించినా రైతుల ఖాతాల్లో మాత్రం జమ కాలేదు.

రెండు లక్షల ఎకరాల్లో పంట నష్టం..

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.28 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందన్న విషయాన్ని నాడు ఖమ్మం జిల్లాలో పంటల పరిశీలన సందర్భంగా అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఇందులో మొక్కజొన్న 1,29,446 ఎకరాలు, వరి 72,709 ఎకరాలు, మామిడి 8,865 ఎకరాల్లో నష్టపోయిందని పేర్కొన్నారు. గతేడాది మార్చి 23న ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో కేసీఆర్ పర్యటించి నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా పంటనష్టం జరిగిన 26 జిల్లాల్లో వ్యవసాయాధికారులు సర్వే నిర్వహించి 1,51,545 ఎకరాల్లో నష్టం జరిగినట్లు తేల్చారు. దీనికి సంబంధించి ఎకరానికి రూ.10 వేల చొప్పున రూ.151.54 కోట్లు విడుదల చేస్తున్నట్లు గతేడాది జూన్‌లో కేసీఆర్ సర్కారు ప్రకటించింది. మొత్తం 1,30,988 మంది రైతులు పరిహారానికి అర్హులుగా పేర్కొంది. అయితే మార్చి నెల పరిహారాన్ని మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేసింది. కాగా, జగిత్యాల జిల్లాలో గతేడాది మార్చి, ఏప్రిల్‌తోపాటు జూలైనూ కలిపి 73,686 ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో మార్చిలోనే 6,199 ఎకరాల్లో పంటలు దెబ్బతినగా.. కేవలం 532 ఎకరాలకే పరిహారం చెల్లించారు. ఏప్రిల్‌లో 52 వేల ఎకరాల్లో, జూలైలో భారీ వర్షాలకు 15,487 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లగా.. ఇప్పటివరకు పరిహారం ఇవ్వలేదు. మొత్తంగా రెండో విడతకు సంబంధించి 20,160 మంది రైతులకు పరిహారం కింద రూ.36.69 కోట్లు చెల్లించాల్సి ఉంది.

ఆర్థిక శాఖలో పెండింగ్..

రెండో విడత పంట నష్టం పరిహారానికి సంబంధించిన నిధులు ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో 2 విడతలకు సంబంధించి రూ.151.54 కోట్లు విడుదల చేయగా వాటికి ఫైనాన్స్ క్లియరెన్స్ లభించలేదని అధికారులు చెబుతున్నారు. క్లియరెన్స్ వస్తే నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే అవకాశముంది. దీనిపై కొత్త ప్రభుత్వం దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

ఏడు ఎకరాల్లో పంట నష్టపోయాను



గతేడాది యాసంగిలో ఏడెకరాల్లో వరి పంట సాగు చేస్తే వడగళ్లు, ఈదురుగాలుల కారణంగా పంటంతా నాశనమైంది. చేతికొచ్చిన గింజలన్నీ చేలోనే రాలిపోయి ఏమీ చేతికిరాలేదు. పంట సాగుకు పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. అధికారులు సర్వే చేసి పంట నష్ట పరిహారం అందిస్తామని చెప్పారు. కానీ, ఏడాది దాటుతున్నా ఒక్క పైసా పరిహారం రాలేదు. అధికారులను అడిగితే ప్రభుత్వం వద్దే పైసలు ఆగిపోయాయని చెబుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పరిహారాన్ని అందించాలి. - గొడ్డేటి రాజు, గానుగుపహాడ్, జనగామ జిల్లా

రేపు తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనం రద్దు

తిరుమల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నెల తొమ్మిదో తేదీన ఉగాది ఆస్థానం సందర్భంగా మంగళవారం శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (ఆలయ శుద్ధి) నిర్వహించనున్నారు. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమం జరగనుండటంతో వీఐపీ బ్రేక్‌ను టీటీడీ రద్దు చేసింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఇప్పటికే ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను రద్దు చేసిన విషయం తెలిసిందే. ప్రొటోకాల్ పరిధిలో స్వయంగా వచ్చే వీఐపీలకు, ట్రస్టు దాతలకు మాత్రమే బ్రేక్ దర్శన టికెట్లను జారీ చేస్తున్నారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నేపథ్యంలో వీటిని కూడా రద్దు చేస్తున్నట్టు టీటీడీ తెలిపింది. కాగా, ఎన్నికల కోడ్ నేపథ్యంలో తిరుమల శ్రీవారి శ్రీవాణి ట్రస్టుకు గడిచిన 15 రోజుల్లో రూ.22.75 కోట్ల విరాళాలు అందాయి. ఎన్నికల కోడ్ కారణంగా మార్చి 16వ తేదీ నుంచి వీఐపీ బ్రేక్ సిఫారసు లేఖలను టీటీడీ రద్దు చేసింది. ఈ క్రమంలో శ్రీవాణి ట్రస్టుకు రూ.10వేల విరాళం అందించి రూ.500 బ్రేక్ దర్శన టికెట్లను కొనుగోలు చేసే వారి సంఖ్య పెరిగింది.

బెంగాల్‌లో తుఫాను బీభత్సం

- నలుగురి మృతి, 200 మందికి గాయాలు

కలకత్తా, మార్చి 31: పశ్చిమ బెంగాల్‌లోని జల్పాయిగురి జిల్లాలో ఈదురుగాలులతో కూడిన భారీ తుఫాను కారణంగా పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. చెట్లు, హోర్డింగులు, కరెంటు స్తంభాలు నేల కూలాయి. పలు వాహనాలు తిరగబడ్డాయి. దాంతో నలుగురు మృతి చెందగా, 200 మందికిపైగా గాయపడ్డారు. మృతి చెందిన వారికి పశ్చిమ బెంగాల్ సీఎం మమత సానుభూతి తెలిపారు. వారి కుటుంబసభ్యులకు తగిన పరిహారం అందజేస్తామని ప్రకటించారు. గాయపడిన వారికి ప్రభుత్వమే చికిత్స అందిస్తుందని హామీ ఇచ్చారు. కల్లోలిత ప్రాంతాల్లో తగిన రక్షణ చర్యలు చేపట్టవలసిందిగా అధికారులను ఆదేశించారు. బెంగాల్ వరదల్లో మరణించిన వారికి ప్రధాని మోదీ సానుభూతి ప్రకటించారు.

జగన్ నిర్వాకంతో ఏపీ ఖజానా ఖాళీ

అప్పు తీసుకోకపోతే పూటైనా గడవదు... పింఛన్లు ఇవ్వడానికి డబ్బు లేక టీడీపీపై నెపం మోపే యత్నం: చంద్రబాబు

- మార్కాపురం, ఎమ్మిగనూరు, బాపట్లల్లో భారీ బహిరంగ సభలు



బాపట్ల/కర్నూలు/ఒంగోలు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ నిర్వాకంతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయి ఖజానా ఖాళీ అయిందని టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారు. అప్పు తీసుకోకపోతే పూటగడవని స్థితికి ప్రభుత్వం చేరుకుందన్నారు. ప్రస్తుతం పింఛన్లు ఇవ్వడానికి కూడా డబ్బు లేక.. ఆ నెపం టీడీపీపై మోపే ప్రయత్నం చేస్తున్నాడని ధ్వజమెత్తారు. ప్రజాగళం యాత్రలో భాగంగా ఆదివారం ఆయన ప్రకాశం జిల్లా మార్కాపురం, కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు, బాపట్ల జిల్లా కేంద్రంలో జరిగిన భారీ బహిరంగ సభల్లో ప్రసంగించారు. జగన్ ఈ ఐదేళ్లలో రూ.13 లక్షల కోట్ల అప్పు చేశాడని, వాటిని ఆయన రేత పత్రిక తీరుస్తుందా.. భారతీ సిమెంట్స్ తీరుస్తుందా అని నిలదీశారు. ఈ సీఎం నమ్మించి గొంతు కోసే రకమని దుయ్యబట్టారు. రాయలసీమ బిడ్డనని చెప్పుకొంటూ ఈ ప్రాంతానికి ఏమీ చేయలేదన్నారు. ఈ ప్రాంతంలో 52 అసెంబ్లీ స్థానాలుంటే గత ఎన్నికల్లో 49 మంది వైసీపీ ఎమ్మెల్యేలను గెలిపించారని.. కానీ ఒక్క పనైనా చేశాడా అని ప్రశ్నించారు. ఐదేళ్లలో ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టయినా పూర్తి చేశాడా.. కర్నూలు ప్రాంతానికి కనీసం నీళ్ల ఇవ్వాలన్న ఆలోచనైనా చేశాడా.. పేదలు, యువత భవిష్యత్ గురించి ఆలోచించాడా అని నిలదీశారు. ఆయన రాయలసీమ ద్రోహి అని.. ఒక్క ఓటు వేసినా మన నెత్తిన మనమే చెత్తవేసుకున్నట్లు అవుతుందని హెచ్చరించారు. బటన్ నొక్కి ప్రజల సంక్షేమమని ప్రతిరోజూ చెబుతున్నాడని.. అలాగైతే మద్య నిషేధం, జాబ్ కేలెండర్, డీఎస్సీలపై ఎందుకు నొక్కలేదని ప్రశ్నించారు. తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచాడని.. ఆర్టీసీ, పెట్రోలు, డీజిల్, నిత్యావసరాల ధరలు పెరిగి జనం అల్లాడుతుంటే.. వాటిని తగ్గించే బటన్ ఎందుకు నొక్కలేదన్నారు. 'సంక్షేమం పేరుతో రూ.10 ఇచ్చి రూ.100 లాగేసుకుంటున్నాడు. బటన్ నొక్కి ఇచ్చింది ఎంత? ప్రజల నుంచి నొక్కింది ఎంత? అందులో మీరు బొక్కింది ఎంత' అని నిలదీశారు. రాష్ట్ర విభజన సమయంలో ఏపీ కన్నా తెలంగాణలో తలసరి ఆదాయం 35 శాతం అధికంగా ఉంటే 2014-19లో దానిని 27 శాతానికి తగ్గేలా చేశామని.. జగన్ వచ్చాక తేడా 45 శాతానికి పెరిగిందని.. బటన్ నొక్కి పేదల సంక్షేమం చేస్తే ఇంత వ్యత్యాసం ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. ఐదేళ్లుగా రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న శని మే 13తో విరగడైపోతుందని చెప్పారు.

ఫ్యాన్ చెత్తబుట్టలోకే..

ఈ ఎన్నికల్లో ఫ్యాన్ ముక్కలై చెత్తబుట్టలో పడేయడం ఖాయమని చంద్రబాబు అన్నారు. "ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని, విధ్వంసకర వైసీపీ పాలన అంతం కావాలన్న ఉద్దేశంతో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి పొత్తుకు ఆద్యుడు పవన్. మూడు పార్టీలు కలవడం మాకోసం, మా రాజకీయాల కోసం కాదు. ప్రజలు గెలవాలి, ఏపీ బాగుండాలన్న ఉద్దేశం తోనే! ఈ విషయాన్ని ప్రజలంతా గుర్తించాలి. సంక్షేమంతో పాటు అభివృద్ధి చేయాలంటే కేంద్రం సహకారం అవసరం. రాష్ట్ర ప్రయోజనాల కోసమే పొత్తు పెట్టుకున్నాం. మేం కలిస్తే జగన్ ఎందుకు కంగారు పడుతున్నాడు? ముస్లింలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాడు. ఎన్డీయే అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు పోతాయని రెచ్చగొడుతున్నారు" అని మండిపడ్డారు.

కూటమి విజయం ఖాయం: పవన్

- వైసీపీ దోపిడీని అరికడితే అన్ని పథకాలకు నిధులు వస్తాయి
- పింఛన్లు అందేలా చూడండి.. 3 పార్టీల నేతలకు జనసేనాని పిలుపు



పిఠాపురం, మార్చి 31: రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి రాబోయేది జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి ప్రభుత్వమేనని జనసేన అధినేత పవన్ కల్యాణ్ పునరుద్ఘాటించారు. భారీ మెజారిటీతో సీట్లు గెలవబోతున్నామని తెలిపారు. ప్రస్తుతం అమలు చేస్తున్న ఏ సంక్షేమ పథకం ఆగిపోదని.. ఈ విషయాన్ని స్పష్టంగా అందరికీ తెలియజేయాలని మూడు పార్టీల నేతలకు పిలుపిచ్చారు. ఆదివారం కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కుమారపురం గోకులం గ్రాండ్‌లో ఆదివారం పిఠాపురం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం, ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసి సైబరాబాద్ వంటి ప్రత్యేక నగరాన్ని తయారు చేసిన అనుభవజ్ఞుడు, టీడీపీ అధినేత చంద్రబాబును జగన్ ప్రభుత్వం అకారణంగా, కక్షపూరితంగా జైలులో పెట్టినప్పుడు బాధేసిందని జనసేనాని పవన్ కల్యాణ్ అన్నారు. రాజమహేంద్రవరం వెళ్తున్నప్పుడు దారిపొడవునా టీడీపీ కార్యకర్తలు తమ నాయకుడి కోసం పడిన తపన తనను కదిలించిందని, అందుకే సెంట్రల్ జైలులో చంద్రబాబును కలిశాక తన వంతుగా ఏదైనా చేయాలని భావించి కచ్చితంగా వచ్చే ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి వెళ్తాయని ప్రకటించానని ఆయన తెలిపారు. అప్పుడు తాను చెప్పినట్లుగానే బీజేపీ తమతో కలిసి వచ్చిందని చెప్పారు. ఆ పార్టీ కోసం ఎంపీ సీట్లు తగ్గించుకున్నానని తెలిపారు. తాను పొత్తు కోసం ఎంత తపించానో.. మూడు పార్టీల నాయకులు గెలుపు కోసం అంతే కష్టపడాలని సూచించారు. చిన్న చిన్న ఇబ్బందులు ఉన్నా వాటిని అధిగమించి పనిచేయాలని కోరారు. 'ఇప్పుడు ఇస్తున్న పథకాల కంటే అధికంగానే సంక్షేమ ఫలాలు పంచుతాం. మద్యం, గంజాయి, ఇసుక, ల్యాండ్ మాఫియా వంటి వాటిని అరికడితే అన్ని పథకాలకు కచ్చితంగా డబ్బులు సర్దుబాటవుతాయి. వైసీపీ దోపిడీ అరికడితే అప్పులు చేయకుండానే సంక్షేమ పథకాలు అమలు చేయవచ్చు. ఎన్నికల కోడ్ వల్ల ప్రతినెలా ఒకటో తేదీన అందాల్సిన సామాజిక పింఛన్లు ఈ నెల ఆలస్యం కావచ్చు. వలంటీర్లు లేకుండా పింఛన్లు సక్రమంగా పంపిణీ చేసేందుకు మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల నియామావళికి అనుగుణంగా అధికారులకు సహకరించాలి' అని సూచించారు.

ఉత్తరాదిపై మజ్లిస్ గురి!

- యూపీ, బిహార్‌లో ఖరారైన పొత్తులు
- వ్యూహాత్మకంగా హిందువులకూ టికెట్లు

హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు హైదరాబాద్ పాతనగరంలో.. ఎంసీహెచ్(ప్రస్తుతం జీహెచ్ఎంసీ) ఎన్నికల్లో పత్తర్‌గట్టీ డివిజన్ నుంచి విజయభేరీ మోగించిన మజ్లిస్ ఇత్తేహాదుల్ ముస్లిమీన్(ఎంఐఎం) క్రమంగా జాతీయ పార్టీగా ఎదుగుతోంది. ఈ క్రమంలో బిహార్, యూపీల్లో ఓటుబ్యాంకును.. ఓట్ల శాతాన్ని పెంచుకుంటూ ముందుకు పోతోంది. ఈ క్రమంలో ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో తమకు సిటింగ్ స్థానం ఉన్న మహారాష్ట్రతో పాటు.. యూపీ, బిహార్‌పై ప్రత్యేకంగా దృష్టిసారించింది. "మేము బీజేపీకి వ్యతిరేకం. అలాగని కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమికి మద్దతు కాదు. ఇండియా కూటమి కేవలం ఎన్నికల అవసరాలకే పరిమితం. మైనారిటీ, బడుగు వర్గాల అభ్యున్నతికి మేం పనిచేస్తాం" అని మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. యూపీలో డాక్టర్ పల్లవి పటేల్ నాయకత్వంలోని అప్నాదళ్(కామెరవాడి)తో కలిసి పోటీ చేస్తామని ఆదివారం ఆయన ప్రకటించారు. ప్రగతిశీల మానవ్ సమాజ్ పార్టీ, రాష్ట్రీయ ఉదయ్ పార్టీతోనూ పొత్తు ఉంటుందని, బిహార్‌లోనూ ఎన్డీయే-ఇండియా కూటముల్లో లేని పార్టీలను కలుపుకొనిపోతున్నట్లు వివరించారు. ఉత్తరప్రదేశ్‌లో ఏడు, బిహార్‌లో 11 స్థానాల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. బిహార్‌లో ఐదు చోట్ల హిందువులకు మజ్లిస్ టికెట్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మహారాష్ట్రలో గతంలో ఎంవీఏతో కలిసి పోటీ చేసిన మజ్లిస్.. ఈ సారి ఒంటరిగా వెళ్తోంది. తమ పార్టీ ఔరంగాబాద్ సిటింగ్ ఎంపీ ఇంతియాజ్ జలీల్ అదేస్థానంలో పోటీ చేయనుండగా.. మైనారిటీల బలం ఎక్కువగా ఉన్న మరో నాలుగు చోట్ల మజ్లిస్ బరిలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. కర్ణాటకలో సమీకరణాలు అనుకూలంగా లేనందున పోటీ చేయడం లేదని మజ్లిస్ వర్గాలు తెలిపాయి.

విద్యుదాఘాతంతో సామగ్రి దగ్ధం

తొర్రూరు రూరల్, మార్చి 31 : విద్యుదాఘాతంతో ఇంట్లోని సామగ్రి దగ్ధమైన ఘటన ఆదివారం గుడిబండతండా గ్రామ పరిధిలో సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామ పరిధిలోని కండియా తండాకు చెందిన బానోత్ శ్రీను వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లగా ఇంటి వద్ద విద్యుత్ వైర్లు ఒక్కసారికిగా ఒక్కదానికొక్కటి తగిలి విద్యుదాఘాతం కావడంతో ఇంట్లో ఉన్న బియ్యం, ఫ్రిజ్, టీవీతో పాటు కొంతమేర పత్తి కాలిపోయినట్లు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి శ్రీను కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చూస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు నిరంజన్‌రెడ్డి, సోమరాజశేఖర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు

● మునిసిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న


బావిలో పూడికతీతను పరిశీలిస్తున్న వెంకన్న

మహబూబాబాద్ టౌన్, మార్చి 31: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకుప్రత్యేకచర్యలు తీసుకుంటున్నట్లు మునిసిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో ఆదివారం మంచినీటి బావిలో పూడికతీత కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ వెంకన్న మాట్లాడుతూ వేసవిలో మిషన్ భగీరథ నీరు రాకుంటే ప్రజలకు నీటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ప్రణాళికలు రచిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ప్రత్యామ్నాయంగా మంచినీటి బావుల్లో పూడికతీత తీస్తున్నట్లు వివరించారు. ఎవరు అధైర్య పడవద్దని వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బండి ఉప్పలయ్య, మార్నేని కిరణ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గూడూరు, మార్చి 31 : మండలంలోని గుండెంగ, పొనుగోడు, మదనాపురం, లక్ష్మీపురం, పాటిమీదితండ గ్రామాల్లో సోమవారం ఉదయం 6.30 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ అమ్ములు ఆదివారం తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలో ఫీడర్‌ల కింద చెట్ల తొలగింపు కార్యక్రమం ఉందన్నారు. ప్రజలు విద్యుత్ సరఫరా అంతరాయంకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రాజ్యాంగ రక్షణ యాత్రను సక్సెస్ చేయండి

● టీఎంఎం జిల్లా అధ్యక్షుడు గుర్రాల లింగయ్య


సమావేశంలో మాట్లాడుతున్న లింగయ్య

మహబూబాబాద్‌టౌన్, మార్చి 31 : రాష్ట్రంలో ఏప్రిల్ 2 నుంచి 8 వరకు జరుపతలపెట్టిన రాజ్యాంగ రక్షణ యాత్రను జయప్రదం చేయాలని తెలంగాణ మాలమహానాడు (టీఎం ఎం) జిల్లా అధ్యక్షుడు గుర్రాల లింగయ్య పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆదివారం రాజ్యాంగ రక్షణ యాత్ర కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రక్షణ ఉండదని, దానిని పరిరక్షించుకోవడానికి ప్రతి ఒక్కరు కంకణబద్ధులు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 4న మానుకోట జిల్లాలో జరిగే రాజ్యాంగ రక్షణ యాత్రకు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

'కాంగ్రెస్ పార్టీలో చేరికలకు అనుమతి ఇవ్వొద్దు'

గూడూరు, మార్చి31 : మండలంలోని రాములుతండాలో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరడానికి అనుమతించవద్దని ఆ గ్రామపార్టీ అధ్యక్షుడు గోదాసి వెంకన్న, మాజీ సర్పంచ్ గుగులోతు లక్ష్మి, ఎనుముల శ్రీనివాస్, స్వామిలు ఒక ప్రకటనలో కోరారు. గ్రామంలో ముఖ్యకార్యకర్తలతో సమావేశం నిర్వహించినట్లు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి వలసలు వచ్చే వారిని పార్టీలో చేర్చుకోవద్దని చెప్పారు. గత 50 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ కష్ట, నష్టాల్లో ఉన్నప్పుడు పార్టీని అంటిపెట్టుకుని ఉన్నామని చెప్పారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ మండల నాయకులు బీఆర్ఎస్, కార్యకర్తలు, నాయకులను పార్టీలో చేర్చుకోవద్దని, దానికి గ్రామపార్టీ అంగీకారం లేదని స్పష్టం చేశారు.

జిల్లాలో ఘనంగా ఈస్టర్ వేడుకలు


పట్టణంలో కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభిస్తున్న ఫాదర్ నిరీక్షణ్ రావు


కేసముద్రం విలేజ చర్చిలో ఈస్టర్ వేడుకలో పాల్గొన్న క్రైస్తవులు

కేసముద్రం, మార్చి 31 : మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న చర్చిలలో ఆదివారం ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేసముద్రం విలేజి ఎన్టీఆర్‌నగర్ కాలనీ అగాపే ఫుల్ గాస్పల్ చర్చిలో పాస్టర్స్ లే లీడర్స్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్షుడు పిల్లి కుమారస్వామి మాట్లాడారు. ఏసుక్రీస్తు మరణాన్ని గెలిచి శిలువ వేసిన మూడోరోజున సమాధి నుంచి బయటకు వచ్చాడని అన్నారు. కార్యక్రమాల్లో జీలి రాములు, చేతి సతీష్, సంతోష్, కర్ర నర్సింహారెడ్డి, పూస యాకయ్య, దాసరి యాకాంబ్రం, ప్రశాంత్, పూస అంజయ్య పాల్గొన్నారు.

● తొర్రూరు : శిలువపై మరణించిన ఏసుక్రీస్తు 3వ రోజు పునఃజన్ముడై భక్తులకు తిరిగి కనిపించిన రోజును ఈస్టర్‌గా క్రైస్తవులు ఘనంగా నిర్వహించుకున్నారు. డివిజన్ కేంద్రంలోని బిలీవర్స్ చర్చిలో ఈస్టర్ రెవరెండ్ ఫాదర్ డీకే నిరీక్షణ్‌రావు ఆధ్వర్యంలో ప్రభు సందేశాన్ని భక్తులకు వివరించి, కేక్ కట్‌చేసి వేడుకలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు నందు విశ్వాసం గల వారికి ఆయన ఎప్పుడు రక్షకుడిగా ఉంటాడని, వారి కోరికలను నెరవేరుస్తూ భక్తులను ఆశీర్వదిస్తాడని తెలిపారు. ఏసుని స్తుతిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మిషన్ ప్రావిన్స్ వికార్, పీసీసీ సభ్యుడు తిరుపతి రెడ్డి, సీనియర్ నాయకుడు పెదగాని సోమయ్య, సోమ రాజశేఖర్, బుచ్చయ్య, నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● డోర్నకల్ : ఏసుక్రీస్తు పునరుజ్జీవనం చెందిన రోజైన ఈస్టర్‌ను క్రైస్తవులు జరుపుకున్నారు. డోర్నకల్‌లోని సీఎస్ఐ, ఆర్సీఎం, పెంతెకొస్తు, జీసెస్‌క్రైస్ట్, ఎల్ ఈలం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. డోర్నకల్ సీఎస్ఐ చర్చిలో బిషప్ కోడిరెక్క పద్మారావు దైవసందేశం వినిపించారు. ఈ కార్యక్రమానికి క్రైస్తవ భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

కృపాకర్ రాజుకు సేవారత్న అవార్డు

తొర్రూరు, మార్చి 31 : తొర్రూరు పట్టణ కేంద్రానికి చెందిన అయ్యప్ప గురుస్వామి, కళాకారుడు, పాలకుర్తి దేవస్థాన కమిటీ సభ్యుడు కొనుగోటి కృపాకర్ రాజుకు తెలంగాణ అయ్యప్ప స్వామి సేవార్థి ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో పుష్పగిరి పీఠాధిపతి అభినవోద్దన విద్యాశంకర భారతి స్వామి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేతులమీదుగా అయ్యప్ప సేవా రత్న అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా అయ్యప్ప సేవకుడిగా గుర్తింపు పొంది గురుస్వామిగా, గాయకుడిగా వేలాది మందికి సుపరిచితుడిగా ఉండి 60 సార్లు అయ్యప్ప దర్శనం చేసుకోవడం జరిగిందన్నారు. అయ్యప్ప ఆశీస్సులతో తనకు అవార్డు లభించిందన్నారు. తన అవార్డుకు సహకరించిన రాష్ట్ర అయ్యప్ప సేవార్థి నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు భాస్కరాచారి, కుమారస్వామి, బ్రహ్మం, రమేష్, సుధాకర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అష్టలక్ష్మి దేవాలయంలో చండీహోమం

● ప్రత్యేక పూజలు చేసిన ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే


అష్టలక్ష్మి దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, మార్చి 31 : జిల్లా కేంద్రంలోని అనంతాద్రి రోడ్‌లో నూతనంగా నిర్మించిన అష్టలక్ష్మీ దేవాలయంలో ఆదివారం చండీ హోమాన్ని నిర్వహించారు. అర్చకులు రంగవఝ్జుల సుధాకరశాస్త్రి, శ్రీకాంత్ మంత్రోచ్చరణల నడుమ శ్రీవిఘ్నేశ్వర సహిత అష్టలక్ష్మీ దేవాలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ శోభాకృత్ నామ సంవత్సర పాల్గుణ బహుళ షష్టి రోజున ఉద యం 7.02 గంటలకు అమ్మవారి సప్తశతీ హవనం నిర్వహించారు. అనంతరం హోమాన్ని నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మానుకోట ఎంపీ మాలోతు కవిత, మాజీమంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ వేర్వేరుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, నూకల నరేష్‌రెడ్డి, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, మనాది రాజేష్, ట్రస్టు బాధ్యులు వేంశెట్టి మధు, కనమర్లపుడి వెంకటేశ్వర్లు, భాస్కర్, ప్రతాపని పాండురంగయ్య, నాళ్ల వీరన్న, ఇమ్మడి రవికుమార్, నాళ్ల లక్ష్మీనర్సింహారావు, గోపాల్ ఝూవర్, మార్నేని రఘు, కిరణ్, దౌలాగర్ శంకర్ పాల్గొన్నారు.

ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందాలి

● ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ వినోద్‌కుమార్



మానుకోటలోని ఆర్టీసీ డిపోలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

మహబూబాబాద్ టౌన్, మార్చి 31 : ఉద్యోగులకు పదవీవిరమణ సహజమేనని, వారు విధుల్లో ఉన్న సమయంలో ప్రజలకు సేవలందించి వారి మన్ననలు పొందాలని టీఎస్-ఆర్టీసీ కరీంనగర్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. మహబూబాబాద్ ఆర్టీసీ డిపోలోఉద్యోగులు పట్టాభిలక్ష్మయ్య, బీఎస్.రావు, టీ.స్వర్ణలత పదవీవిరమణ అభినందన సభను ఆది వారం నిర్వహించారు. పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులను ఉన్నతాధికారులు, బంధువులు, స్నేహితు లు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా స్థానిక డీఎం శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. వరంగల్ రీజియన్ డిప్యూటీ ఆర్ఎం కె.భానుకిరణ్, రిటైర్డ్ డీవీఎం నాగేశ్వర్‌రావు, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో అంబరీష, కె.మల్లయ్య, బీఎస్.రెడ్డి, చంద్యానాయక్, డాక్టర్ డోలి సత్యనారాయణ, వెంకట్‌రెడ్డి, సుధాకర్, తోట వెంకన్న, ఆరుద్ర పరమాత్మాచారి, పిల్లి సుధాకర్ పాల్గొన్నారు.

గూడూరు బస్టాండ్ సందర్శన..

గూడూరు : గూడూరు ఆర్టీసీ బస్టాండ్‌ను ఆదివారం ఆర్టీసీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ వినోద్‌కుమార్ ఆదివారం సందర్శించారు. ఆర్టీసీ బస్సులు క్రమం తప్పకుండా బస్టాండ్‌లోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రయాణికుల సౌకర్యార్థం కంట్రోలర్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. లక్షలాది రూపాయలతో బస్టాండ్‌లో మరమ్మతుల పనులు చేపట్టామని బస్సులు బస్టాండ్‌లోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బస్సులు బస్టాండ్‌లోకి రాకపోతే ప్రయాణికులు ఫిర్యాదు చేయవచ్చని స్పష్టం చేశారు. ఆర్ఎం భానుకిరణ్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కెఎస్.రావు ఉన్నారు.

మానుకోట రైల్వేస్టేషన్‌లో విస్తృత తనిఖీలు


మానుకోటలో రైలులోని ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేస్తున్న డీఎస్పీ తిరుపతిరావు, పోలీసులు

మహబూబాబాద్ రూరల్, మార్చి 31 : మానుకోట పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో డీఎస్పీ తిరుపతిరావు నేతృత్వంలో ఆదివారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ ఆదేశాల మేరకు పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ముందస్తు చర్యల్లో భాగంగా తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. అనుమానం ఉన్న వ్యక్తుల బ్యాగులను క్షుణ్ణంగా పరిశీలించడంతోపాటు రైళ్లలో ఉన్న బ్యాగులను సైతం తనిఖీ చేపట్టారు. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సైలు శివ, అరుణ, దీపికారెడ్డి పాల్గొన్నారు.

కేసముద్రంలో..

కేసముద్రం : పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో కేసముద్రం రైల్వేస్టేషన్‌లో డీఎస్పీ ఎస్.తిరుపతిరావు ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఫ్లాట్‌ఫాంపై అనుమానాస్పదంగా కనిపించిన వస్తువులను, బ్యాగులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య స్థానిక ఎస్ఐ వంశీధర్, సిబ్బంది ఉన్నారు.

డోర్నకల్ మండలంలో పోలీసుల కవాతు

డోర్నకల్, మార్చి 31 : మండలంలోని అమ్మపాలెం, బంజర, రాజుతండా, ఉయ్యాలవాడల్లో ఆదివారం పోలీసులు, కేంద్ర బలగాలతో పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఉపేందర్‌రావు మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి అల్లర్లకు పాల్పడిన, ఎవరినైనా బెదిరింపులకు గురిచేసినా వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

డోర్నకల్, మార్చి 31 : డోర్నకల్ మునిసిపల్ శివారులోని మున్నేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు డోర్నకల్ సీఐ ఉపేందర్‌రావు ఆదివారం తెలిపారు. డోర్నకల్‌కు చెందిన సైదులు అనే వ్యక్తికి చెందిన ట్రాక్టర్ ద్వార ఎలాంటి అనుమతులు లేకుండ ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించి ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు చెప్పారు.

బూటకపు ఎన్నికలను బహిష్కరించండి

● హిందుత్వ ఫాసిస్టు బీజేపీతో అంటకాగే పార్టీలను తరిమికొట్టండి

● మావోయిస్టు బీకే.ఏఎస్ఆర్ నేత ఆజాద్

మహబూబాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : బూటకపు పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరించాలని, బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు భారతీయ జనతా పార్టీ (బీజేపీ)ని తరమాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ (బీకే.ఏఎస్ఆర్) కమిటీ పిలుపునిచ్చింది. భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) బీకే.ఏఎస్ఆర్ నేత ఆజాద్ పేరిట ఆదివారం 'ఆంధ్రజ్యోతి' కార్యాలయానికి పంపిన ప్రకటనలో పలు అంశాలను వెల్లడించారు. బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు బీజేపీతో అంటకాగే పార్టీలను తరిమికొట్టాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ ఈ సారి కూడా తమదే అధికారమని విర్రవీగుతోందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో జగన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి ఇద్దరు మాదే రాజ్యం అన్నట్లు వ్యవహరిస్తూ ప్రత్యర్థులకు అభ్యర్థులు లేకుండా చేసేందుకు విశ్వప్రయత్నాలు చేస్తూ, సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారని పేర్కొన్నారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతావనిలో ఎన్నికలు పేదల బతుకులు ఏమి మార్చాయో, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పేదలకు ఏమి మేలుచేసిందో వారే చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలు కూడా ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. కేవలం పెట్టుబడిదారులు, సామ్రాజ్యవాద ఏజెంట్లు ఎన్నికల్లో గెలిచి వారి ఆస్తిపాస్తులను లెక్కలేనన్ని కోట్ల రూపాయలను కూడబెట్టుకునేందుకు ఈ ఎన్నికలు పనికి వచ్చేయే తప్ప, ప్రజల కష్టాలు.. సమస్యల పరిష్కారానికి ఏ మాత్రం ఉపయోగపడలేదన్నది నగ్నసత్యమన్నారు. రెండురాష్ట్రాల్లో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, వైసీపీ, టీడీపీ ప్రజల వద్దకు ఓట్లు అడిగేందుకు వస్తున్నాయని, ఈ బూటకపు ఎన్నికలను బహిష్కరించాలని మావోయిస్టు పార్టీ పిలుపునిస్తోందని చెప్పారు.

ఓట్లు కొనుక్కునే పార్టీలు ఉన్నంత కాలం..

దేశం, రాష్ట్రాల్లో శ్రమదోపిడీ చేస్తూ అవినీతికి పాల్పడి సంపాదించిన డబ్బుతో ఓట్లు కొనుక్కునే పార్టీలు ఉన్నంత కాలం భారత్ బాగుపడదని మావోయిస్టు నేత ఆజాద్ అన్నారు. రూ.వేల కోట్లు సంపాదించిన పార్లమెంట్ నాయకులు కార్పొరేట్లను అందలం ఎక్కించే పనిలో బిజీగా ఉన్నారని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నీటి బుడగలుగా మారిపోతున్నాయని వాపోయారు. భూమి, తాగునీరు, విద్య, వైద్యం, నిరుద్యోగం, ఆకలి సమస్యలు ఉన్నప్పటికి పరిష్కారం చేయకుండా కాలం వెల్లబుచ్చుతున్నారని చెప్పారు. ప్రశ్నించే ఉద్యమకారులను, రచయితలను, జర్నలిస్టులను అణిచివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్షాలను సైతం అనేకసాకులతో వేధింపులకు గురిచేస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిపక్షాలపై, ప్రజాసంఘాలపై, పౌరహక్కులపై దాడి చేస్తున్నాయని చెప్పారు. మావోయిస్టు పార్టీ, విప్లవ ప్రజాసంఘాలు, విప్లవ ప్రజాస్వామ్య ప్రగతిశీల సంస్థలపై నిషేధాన్ని విధించి ఉపావంటి నిర్బంధ చట్టాలతో దాడులు చేయిస్తోందన్నారు. దళిత, ఆదివాసీ, కార్మిక, కర్షక, విద్యార్థి, యువజన, మేధావులపై బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు దాడులు కొనసాగిస్తున్నాయన్నారు.

7న సైనిక్ స్కూల్ అర్హత పరీక్ష

మహబూబాబాద్ టౌన్, మార్చి31 : తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ (టీటీడబ్ల్యూఆర్) వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం అశోక్‌నగర్ సైనిక్ స్కూల్‌లో ఈనెల 7న ఆరో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర ప్రవేశపరీక్షలను నిర్వహిస్తున్నట్లు మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ ఏవీ రాజ్యలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 7న 6వ తరగతి ప్రవేశం కోసం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, ఇంటర్మీడియట్ ప్రవేశం కోసం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు పరీక్ష ఉంటుందని చెప్పారు. విద్యార్థులు వారి హాల్‌టికెట్‌లను ఈనెల 1వ తేదీ నుంచి వెబ్‌సైట్ www. tgtwguruculam. telangana. gov.in ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని చెప్పారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

డోర్నకల్, మార్చి 31 : డోర్నకల్‌లో రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. డోర్నకల్ జీఆర్పీ ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. డోర్నకల్ రైల్వేస్టేషన్ సమీపంలోని కిలోమీటర్ నెంబర్ 463/28-30 వద్ద(డౌన్‌లైన్) గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు గూడ్స్ రైలు పైలెట్ స్టేషన్‌మాస్టర్‌కు సమాచారం అందించాడు. ఈ విషయాన్ని స్టేషన్ మాస్టర్ జీఆర్పీ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్నిపరిశీలించారు. మృతుని వయస్సు సుమారు 40 నుంచి 45 మధ్య ఉంటుందని, ప్రమాదం జరిగిన తీరును పరిశీలిస్తే రైలునుంచి జారిపడి మృతి చెందినట్లు ఉందని చెప్పారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహాన్ని ఖమ్మం అన్నం ఫౌండేషన్ సహకారంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్సై తెలిపారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి

పెద్దవంగర, మార్చి 31 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపు కోసం వరంగల్‌లోని కేఎల్ఎన్ చింతలగట్టు ఫంక్షన్‌హాల్ ఏర్పాటు చేసిన పార్లమెంట్ సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సమావేశానికి మాజీ మంత్రులు హరీష్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు ముఖ్య అతిథులుగా హాజరుకావడం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, ముఖ్యనాయకులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ఇల్లులేక టెంటు దిక్కు..

● మూడేళ్ల క్రితం తండ్రి.. నేడు తల్లి మృతి..

● అనాథలైన ముగ్గురు పిల్లలు


కేసముద్రం విలేజ చైతన్యనగర్ కాలనీలో టెంటు వేసుకొని ఉన్న అన్నాచెల్లెలు

కేసముద్రం, మార్చి 31 : మూడేళ్ల క్రితం తండ్రి, నేడు తల్లి అనారోగ్యంతో మృతి చెందడంతో అనాథలైన ముగ్గురు పిల్లలు కూలీలకు సొంత ఇల్లు లేక టెంటే దిక్కైంది. కేసముద్రం విలేజి చైతన్యనగర్ కాలనీకి చెందిన దుర్గం ధర్మయ్య(45) అనారోగ్యంతో 2021లో మృతి చెందాడు. దీంతో ఆయన భార్య శోభ (36) తన ముగ్గురు పిల్లలు దేవేందర్, అమర్, అఖిలను తీసుకొని నర్సంపేటలో అద్దె ఇంట్లో ఉంటోంది. ఈ క్రమంలో ఐదు రోజుల క్రితం అనారోగ్యంతో శోభ మృతి చెందగా కేసముద్రం విలేజికి మృతదేహాన్ని తీసుకువచ్చి పలువురి ఆర్థిక సహాయంతో అంత్యక్రియలు నిర్వహించారు. వీరికి కాలనీలో స్థలం ఉన్నప్పటికీ ఇల్లు లేకపోవడంతో అక్కడే టెంటు వేసుకొని దయనీయ పరిస్థితుల్లో ఐదు రోజులుగా ఉంటున్నారు. కూలీ పనిచేసుకుని జీవిస్తున్న వీరు ప్రభుత్వం, దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్నారు.

ఎన్డీ పార్లమెంట్ అభ్యర్థిగా మురళీకృష్ణ

మహబూబాబాద్ రూరల్, మార్చి 31 : మహబూబాబాద్ పార్లమెంట్ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ అభ్యర్థిగా మోకాళ్ల మురళీకృష్ణ పోటీ చేయనున్నట్లు ఎన్డీ కేంద్ర కమిటీ సభ్యుడు అవునూరి మధు, ఎన్డీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్యలు తెలిపారు. మహబూబాబాద్ వికాస్ డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో జడ సత్యనారాయణ, బండారి ఐలయ్య, మండల వెంకన్న, శివ్వారపు శ్రీధర్, శ్రీశైలం, హెచ్.లింగన్న, నందగిరి వెంకటేశ్వర్లు, గుగులోతు సక్రు, ఎస్‌కె.బాబన్న, లింగయ్య, భట్టు చైతన్య, బోనగిరి మధు, చారీ హరీష్, నాగరాజు పాల్గొన్నారు.

లక్ష్యం 1.70 లక్షల మెట్రిక్ టన్నులు

(3వ పేజీ తరువాయి)

ప్రారంభమవుతాయి. దాని ఆధారంగానే ధాన్యం కొనుగోళ్లు చేపడతారు. రైతు రాకుంటే వడ్ల సేకరణ జరుగదు.

ఏ సీజన్‌కు.. ఆ సీజనే..

సివిల్ సప్లయీస్ అధికారులు కేటాయించిన ధాన్యాన్ని కొందరు రైస్‌మిల్లర్లు బహటంగానే అమ్ముకుంటున్నారు. అయితే వర్షానికి వడ్ల తడిసిపోయాయని సాకులు చెబుతూ.. సీఎంఆర్ పెట్టకుండా తప్పించుకుంటున్నారు. దీంతో రికవరీ తలనొప్పిగా మారింది. ఈ విధానానికి చెక్‌పెట్టేందుకు ఈ ఏప్రిల్ నెలలో మిల్లర్లకు ఇచ్చే బియ్యాన్ని సెప్టెంబర్ 30 (ఆరు నెలల వ్యవధి) వరకు ధాన్యాన్ని మర ఆడించి, సీఎంఆర్ బియ్యంగా పెట్టాలని నూతన నిబంధనలు అమల్లోకి తెచ్చారు. ఇక వాయిదాలు పెట్టకుండా బియ్యం రికవరీకి కఠిన నిర్ణయం తీసుకుంటున్నారు.

జాడలేని కాంగ్రెస్ బోనస్...?

కాంగ్రెస్ గ్యారెంటీ కార్డులో భాగంగా రైతు భరోసాలో వరిపంటకు రూ.500లు బోనస్‌గా అందజేస్తామని కాంగ్రెస్ ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ప్రకటించింది. హస్తం పార్టీ అధికారంలోకి వచ్చి వంద రోజులు గడిచిపోయాయి. ఈ యాసంగి నుంచే వరికి రూ.500 బోనస్ వస్తుందని రైతులు ఆశపడ్డారు. దీనిపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. ఏప్రిల్ 1 నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమవుతుండడంతోఈ యాసంగిలో రూ.500 బోనస్ లేనట్లే.! వచ్చే వానకాలం నుంచి బోనస్ ప్రకటిస్తారని పలువురు భావిస్తున్నారు.

బాధలు వింటూ.. భరోసానిస్తూ..

(3వ పేజీ తరువాయి)

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాలతో పాటు వరంగల్ నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు తరలివచ్చారు. వారిని కట్టడి చేయడలంలో పోలీసులు విఫలమయ్యారు.

దూసుకొచ్చిన కార్యకర్తలు

12.06 ధరావత్‌తండాకు కేసీఆర్ చేరుకోగా, ఆయనను చూసేందుకు బస్సు చుట్టూ కార్యకర్తలు తోసుకువచ్చారు. కేసీఆర్‌తో ఫొటోలు దిగేందుకు బస్సు డోర్ వద్దనే కార్యకర్తలు మోహరించడంతో ఆయన బస్సు దిగలేకపోయారు. రోప్ పార్టీ పోలీసులు కేసీఆర్‌కు భద్రతావలయంగా ఏర్పడి బందోబస్తు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. దీంతో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కార్యకర్తలు, నాయకులను బతిమిలాడుతూ కేసీఆర్‌కు దారి ఇచ్చే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ కార్యకర్తలు దూరం జరగలేదు. దీంతో కార్యకర్తలు, నాయకుల తోపులాటల మధ్యనే కేసీఆర్ బస్సు దిగి ఎండిన పంటల పొలం వద్దకు వెళ్లారు. ఈ సమయంలోనూ కార్యకర్తలు తోసుకుంటూ వచ్చారు. దీంతో రైతులతో మాట్లాడడం కేసీఆర్‌కు కష్టంగా మారింది. జనం తోపులాటల మధ్యనే కేసీఆర్ తన పర్యటన ముగించారు.

ప్రభుత్వం పంట నష్ట పరిహారం అందించాలి..

జనగామ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : పంట నష్టపోయిన రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరాకు రూ. 25వేలు నష్ట పరిహారం ఇవ్వాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం కేసీఆర్ పర్యటనలో భాగంగా ఆయన చింతబావితండాలో మాట్లాడారు. నెల కిందట నీరు వదిలితే రైతులకు నష్టం జరిగేది కాదన్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా రేవంత్‌రెడ్డి పరిపాలన ఉందని ఎద్దేవా చేశారు.

కేసీఆర్ వాహనం తనిఖీ


మొండ్రాయి చెక్‌పోస్ట్ వద్ద కేసీఆర్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

కొడకండ్ల : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వాహనాన్ని మొండ్రాయిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీ చేశారు. లోకసభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి నేతృత్వంలో కేసీఆర్ ప్రయాణిస్తున్న వాహనాన్ని పూర్తిగా తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కేసీఆర్‌తో పాటు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు గుంతకండ్ల జగదీశ్వర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్ అదే వాహనంలో ఉన్నారు.